క్లుప్తంగా

నేత్రదానం


భూషణం (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన బసవరాజుల భూషణం(65) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కాగా అతని కుమారుడు సత్యనారాయణ తన తండ్రి నేత్రాలను ఖమ్మం నేత్రాలయానికి దానం చేశారు. ఈ మేరకు కంటి వైద్య నిపుణులు డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో మృతుడి కళ్లను సేకరించి తీసుకెళ్లారు.

ఆదివాసీలకే ఎంపీ టికెట్ ఇవ్వాలి

కరకగూడెం: మహబూబాబాద్ ఎంపీ టికెట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆదివాసీ గిరిజన తెగకు చెందిన వారికే ఈసారి కేటాయించాలని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు పాయం నర్సింహరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం చిరుమళ్ల గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ములుగు, భద్రాచలం, పినపాక, ఇల్లెందు సెగ్మెంట్లలో ఆదివాసీలే ఎక్కువగా ఉన్నందున మహబూబాబాద్ నియోజకవర్గ పార్లమెంటులో గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో గురువారం మాస శివరాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు అత్యంత వైభవంగా జరిపించారు.

మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం గ్రామంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొర్స రాముడు(రెడ్డి) జ్ఞాపకార్థం ఈనెల 13, 14, 15 తేదీల్లో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.10,000, రెండో బహుమతి రూ.8000/ అందజేయనున్నట్టు పేర్కొన్నారు. పంచాయతీల వారీగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొనాలనుకునే వారు ఎంట్రీ ఫీజు రూ.500 అని మిగతా వివరాలకు 6300038154, 7981524194, 6303627912 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం

భద్రాచలంటౌన్: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు వసుధ ఫౌండేషన్ సభ్యులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. పట్టణానికి చెందిన లక్ష్మీకాంతంకు వైద్య ఖర్చుల నిమిత్తం ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు రూ.10 వేల నగదు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఖమ్మం జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు ధోరణిని ఎండగట్టాలి

పినపాక: కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణిని ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఎండగడతారని సీపీఎం మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న తెలిపారు. గురువారం బయ్యారం క్రాస్ రోడ్డులో కేరళపై కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ఆంక్షలు విధించిన నేపథ్యంలో ధర్నా నిర్వహించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాను తగ్గించడం, అప్పుపై పరిమితులు విధిస్తూ కేంద్రం ఇబ్బంది పెడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు ధారాదత్తం చేసి ఉద్యోగులను నడి రోడ్డుపై వదిలేస్తుందన్నారు. మండవి రమేష్, దుబ్బా గోవర్ధన్, శంకరయ్య పాల్గొన్నారు.

నివాళి..

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన ఇంటిలిజెన్సీ ఏఎస్సై కాసరబాద శ్రీనివాస్ తల్లి శాంతమ్మ దశదిన కర్మ గురువారం నిర్వహించగా పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీటీసీ నరేష్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.ఖదీర్, అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చర్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బాల్కా సుమన్ అనుచిత వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ నాయకులు తోటమళ్ల వరప్రసాద్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

ఫలించని భగీరథ ప్రయత్నం


చేతిపంపు వద్దే స్నానాలు చేస్తున్న చిన్నారులు


మూలనపడిన సోలార్ పంపుసెట్

నీటి కోసం గొత్తికోయల గోస

- మూలనపడిన మిషన్ భగీరథ సోలార్ పంపు
- ఆరు నెలలైనా మరమ్మతులు కరువు
- అధికారుల నిర్లక్ష్యంతో పాట్లు

అశ్వారావుపేటరూరల్: ఇంటింటికీ తాగునీరు అందించే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం అమలు చేశారు. ఈ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ పంపు సెట్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. కొద్దిగా శ్రద్ధ వహిస్తే మరమ్మతులు చేయించే వీలున్నా అధికారుల పట్టింపులేనితనం కారణంగా వలస గొత్తికోయ కుటుంబాలు తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నాయి.

రూ.2 లక్షలకు పైగా వ్యయంతో ఏర్పాటు

అశ్వారావుపేట మండలం మారుమూల దట్టమైన అటవీ ప్రాంతంలోని చెన్నాపురంకాలనీ (వలస గొత్తికోయల ఆవాసం)లో 30కి పైగా ఆదివాసీల కుటుంబాలు, 80 మంది జనాభా ఉన్నారు. ఈ గొత్తికోయల ఆవాసంలో తాగునీటి ఇక్కట్లు తొలగించేందుకు గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం ద్వారా నాలుగేళ్ల కిందట రూ.2.40 లక్షల వ్యయంతో సోలార్ సిస్టమ్ ద్వారా పంపు సెట్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్లు ఈ సెట్ బాగానే పనిచేయగా, ఆరు నెలల కిందట మోటార్ మరమ్మతులకు గురైంది. ఈ విషయాన్ని గ్రామస్తులు మిషన్ భగీరథ పథకం అధికారులకు చేరవేశారు. దీంతో సిబ్బంది సోలార్ పంపు సెట్‌కు సంబంధించి తాగునీటి మోటార్‌ను బయటకు తీసి మరమ్మతుల కోసం తీసుకెళ్లారు. ఇక అంతే.. ఆ మోటార్ రాలేదు. గ్రామస్తుల దాహం తీరడం లేదు. ఈ అంశంపై అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో రెండు తాగునీటి చేతి పంపులు ఉండగా, ఒకటే పనిచేస్తోంది. దీంతో గ్రామస్తులంతా ఆ చేతి పంపుపైనే ఆధార పడాల్సి వస్తోంది. ఇక తాగునీటి కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవి వాగు వద్దకు వెళ్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించి, తిరిగి బిగించాలని వారంతా కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



మోటారు రిపేరు చేస్తామని ఆరు నెలల కిందట తీసుకెళ్లి మళ్లీ తీసుకురాలేదు. అప్పటి నుంచి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. చేతిపంపు నీళ్లు సరిపోక అవస్థలు ఎదురవుతున్నాయి.

–సోడెం సహదేవుడు, గ్రామస్తుడు

మరమ్మతుల కోసం మోటార్ పంపించాం..

సోలార్ పంపు సెట్ మోటార్‌ను అది సమకూర్చిన కంపెనీ వారే రిపేరు చేయాల్సి ఉండడంతో హైదరాబాద్ పంపించాం. సిబ్బంది లేక ఆలస్యమవుతోందని కంపెనీ బాధ్యులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా వచ్చేలాచూస్తాం.

– లక్ష్మి, ఏఈఈ, మిషన్ భగీరథ, అశ్వారావుపేట

నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి


సమావేశానికి హాజరైన అధికారులు, ఉద్యోగులు

మణుగూరు రూరల్: నాణ్యతతో కూడిన బొగ్గును వినియోగదారులకు సరఫరా చేయాలని ఏరియా జీఎం, మల్టీ డిపార్ట్‌మెంట్ బృంద కన్వీనర్ దుర్గం రామచందర్ సూచించారు. గురువారం ఏరియాలోని పీకేఓసీ 4 గనిని మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం సందర్శించి అధికారులు, ఉద్యోగులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం రామచందర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేట్ సంస్థలకు వేలం ద్వారా విక్రయించడంతో బొగ్గును బహిరంగ మార్కెట్లో విక్రయించుకోవచ్చని బొగ్గు అమ్మకానికి మార్కెట్లో పోటీ పెరుగుతుందన్నారు. ఉద్యోగులందరూ అంకితభావంతో పని చేస్తూ ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని, అలాగే జీఎం కార్యాలయ సిబ్బంది ఉద్యోగుల వేతనాలు, పదోన్నతులు, టెర్మినల్ బెనిఫిట్స్, కాంట్రాక్ట్ బిల్లులు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం వీసం కృష్ణయ్య, ఏజీఎం ఎం.నర్సిరెడ్డి, డీజీఎంలు వెంకట్రావు, ఎస్.రమేష్, అనురాధ, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, గని మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన


చర్ల రూరల్: విద్యార్థులకు అవగాహన..


మణుగూరు రూరల్ : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

చర్ల రూరల్: స్పర్శ లెప్రసి అవేర్‌నెస్ క్యాంపెయిన్ (స్లాక్) కార్యక్రమంలో భాగంగా గురువారం రాహుల్ విజ్ఞాన్ స్కూల్లో విద్యార్థులకు డాక్టర్ శ్రీధర్ కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది వేణు గోపాలకృష్ణ, రాంప్రసాద్, లక్ష్మీ, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని బాపనకుంట ప్రభుత్వ పాఠశాలలో, గ్రామంలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శివకుమార్ పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది రాంప్రసాద్, రవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


చంద్రుగొండ: శ్రమదానం చేస్తున్న అధికారులు


గుండాలలో..


అన్నపురెడ్డిపల్లిలో..


అశ్వాపురం: మొండికుంటలో..

చంద్రుగొండ: ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన పారిశుధ్యం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెడతామని ఎంపీపీ బాణోత్ పార్వతి అన్నారు. మండల కేంద్రం చంద్రుగొండలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం చేపట్టిన పారిశుద్ధ్యం కార్యక్రమంలో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ తోట తులసీరాం, నాయకులు భోజ్యానాయక్, కొడుమూరి దయాకర్‌రావు పాల్గొన్నారు.

గుండాల: ఏడు రోజుల పారిశుధ్య వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ప్రజల భాగస్వామ్యం అవసరమని గుండాల, ఆళ్లపల్లి మండలాలు ఎంపీడీఓ సత్యనారాయణ, రామారావు అన్నారు. మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలపై జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరామకాంత్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ రంగా, పంచాయతీ అధికారులు శ్రీనివాసరావు వలి తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అధికారులు శ్రమదాన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అన్నపూర్ణ, తహసీల్దార్ జగదీశ్వరప్రసాద్, ఎంఈఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారి, తహసీల్దార్ స్వర్ణలత ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కమటం నరేష్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, వీఓఏలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష


ప్రశ్నా పత్రాలను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలో కేఎల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలను గురువారం నిర్వహించారు. ప్రవేశ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నా పత్రాలను విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్‌బాబులు ఆవిష్కరించి మాట్లాడారు. ఏజెన్సీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అధ్యాపకులు బషీర్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

భద్రాచలంటౌన్: ఖమ్మంలో మార్చి 3, 4, 5 జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ యూనిటీ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి స్థానిక డివిజన్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఐ ఎంఎల్ ప్రజాపందా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ ఎంఎల్(ఆర్.ఐ) మూడు విప్లవ పార్టీలు ఐక్యమై ఒకే పార్టీగా ఏర్పడాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కెచ్చల కల్పన, కొండా చరణ్, దాసరి సాయి, శివప్రశాంత్, కుమారి, నసీమా, షకీరా, రమ, శాంతి, బుజ్జక్క, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: ఖమ్మం జిల్లా కేంద్రంలో మార్చి 3 నుండి 5 వరకు ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మహాసభల వాల్‌పోస్టర్లను మండలంలోని లింగాలపల్లిలో ఆవిష్కరించారు. జిల్లా నాయకులు అమర్లపూడి రాము మాట్లాడగా తోడెం దుర్గమ్మ, ఊకే అప్పారావు, కాకా రమేష్, తెల్లం నాగేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు సూచనలు చేస్తున్న సీఐ శివప్రసాద్

పినపాక: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఈ బయ్యారం సీఐ శివప్రసాద్ అన్నారు. గురువారం మండల పరిధిలోని తోగూడెం పంచాయతీలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా గ్రామస్తులకు వాహనదారులకు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీటీసీ చింతపంటి సత్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

- న్యాయం చేయాలంటూ రైతుల వేడుకోలు


మిర్చిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మణుగూరు టౌన్: మండలంలోని తిర్లాపురం పంచాయతీ పరిధి అగ్రహారంలో ఓటీ ప్రభావంతో మిర్చి పంట దిగుబడిపై ప్రభావం పడిందని పలువురు రైతులు కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం కొత్తగూడెంలోని కేవీకే శాస్త్రవేత్తలు, సింగరేణి సేఫ్టీ అధికారి భాస్కర్‌రావుతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అధికారులు లాల్‌చంద్, తాతారావు, రామశివరావుతో పాటు సింగరేణి నిర్వాసిత రైతులు రావుల రాములు, బండ్ల శ్రీను, బండ్ల ప్రసాద్, అటిక రమేశ్, ఎగ్గడి గణేశ్, మురళి, శ్రీను పాల్గొన్నారు.

భట్టుపల్లిలో...

కరకగూడెం: కరకగూడెం మండలం భట్టుపల్లిలో పలువురు రైతులు సాగు చేసిన మిర్చి పంటను కొత్తగూడెం కేవీకే కోఆర్డినేటర్ నారాయణమ్మ, శాస్త్రవేత్త శివ పరిశీలించారు. ఈనెల 5వ తేదీన 'సాక్షి'లో మిర్చిదిగుబడి పడిపోయిందనే అంశంపై 'ఆశలు పెంచి .. ఆవేదనలో ముంచి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు పరిశీలించి సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. మిర్చిలో నల్ల తామర పురుగుల కట్టడికి గట్లు, పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలన్నారు. అలాగే, పంటపై వేప, గానుగ నూనె పిచికారీ చేయాలని... నత్రజని, యూరియా మోతాదుకు మించి వాడొద్దని సూచించారు. మిర్చి పంట చుట్టూ జొన్న, మొక్కజొన్న సాగుచేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు శాంతిప్రియ, లాల్చంద్, తాతారావు, ప్రశాంత్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

సమ్మెను విజయవంతం చేయాలి

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 16న జరిగే సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సమ్మె వాల్‌పోస్టర్లను సీపీఎం కార్యాలయంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో ఏమి చేయకుండా కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూరే విధంగా విధానాలు అమలు చేశారని విమర్శించారు. యలమంచి రవికుమార్, ఎంబీ నర్సారెడ్డి, గద్దం స్వామి, అజయ్‌కుమార్, రాములు, భూపేంద్ర, రవి, శంకర్ పాల్గొన్నారు.

గుండాల: సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. మండలంలోని కొడవటంచ గ్రామంలో జరిగిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ఎంపీపీ ముక్తి సత్యం, సర్పంచ్ కొమరం సీతారాములు, ఆరేం నరేష్,వై వెంకన్న, పర్శిక రవి, గడ్డం లాలయ్య, ఎస్‌కె.అజ్గర్, ఇసం కృష్ణన్న, మంగన్న, బచ్చల సారన్న, పూనెం నరసన్న, పాయం ఎల్లన్న, సూర్యనారాయణ, పటేల్ యానయ్య, మల్లన్న, రామచంద్రయ్య పాల్గొన్నారు.

చర్ల: సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు ముసలి సతీష్ మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన ఆయన వ్యవసాయ కూలీలు, రైతులు, పలు రంగాలకు చెందిన కార్మికులతో మాట్లాడారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

చంద్రుగొండ: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని, విద్యార్థులకు మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాభ్యాసం తీరుతెన్నులను ఆయన పరిశీలించారు. ఉత్తమ క్రమశిక్షణతో ప్రవర్తిస్తూ, తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ తులసీరాం పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి


పరీక్ష నిర్వహిస్తున్న వైద్యాధికారి

కరకగూడెం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు వహించాలని కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి సీహెచ్ కుమారస్వామి అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల పరిధిలోని వెంకట్రాంపురం, నర్సంపేట కాలనీలలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించి సుమారు 80 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ శ్రీనివాసరావు, స్థానిక ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు కలుషితమవుతున్న నేపథ్యంలో ఈ నెల 2న సాక్షిలో ప్రచురితమై భగీరథ నీరు కలుషితం అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం మరమ్మతు చేపట్టారు. ఎంపీడీఓ ముత్యాలరావు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మిషన్ భగీరథ ఏఈ రాముకు పనులు చేపట్టాలని ఆదేశించడంతో పనులను చేపట్టారు.


మరమ్మతులు చేపట్టిన సిబ్బంది

అధ్వానంగా రహదారి..

- గుంతలమయంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు
- నిత్యం ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు, ప్రజలు


గుంతలమయంగా మారిన రహదారి

దుమ్ముగూడెం : మండలంలోని ప్రధాన గ్రామమైన లక్ష్మీనగరం గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం కార్యాలయాలకు వచ్చే అధికారులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాలకు నిత్యం మండలంలోని 104 గ్రామాల నుంచి వందలాది మంది ప్రజలు వస్తుంటారు. రహదారి మొత్తం గోతులమయంగా మారడంతో ఇబ్బంది పడుతున్నారు. లక్ష్మీనగరం ప్రధాన సెంటర్ నుండి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి మొత్తం కూడ గోతులు పడి ద్విచక్ర వాహనదారులు, కార్లు గోతుల్లో నడపలేక సతమతం అవుతున్నారు.

ఇక్కట్లు పడుతున్న ప్రజలు.. పాలకులు,అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారి గుండా రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాల, ఒక ప్రైవేట్ పాఠశాల ఉన్నాయి. విద్యార్థులను నిత్యం పాఠశాలకు తీసుకొచ్చే తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలలోని తమ పిల్లలను చూసేందుకు హాస్టల్‌కు వచ్చే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజలు, అధికారులు పడుతున్న కష్టాలను గ్రహించి నూతన రహదారిని నిర్మించాలని కోరుతున్నారు.

నూతన రహదారి నిర్మించాలి..



ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రహదారి అంతా గోతులమయంగా మారి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందల మంది ఈ రహదారి మీదుగా ప్రభుత్వ కార్యాలయాకు వస్తుంటారు జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను గుర్తించి నూతన రహదారిని నిర్మించాలి. అచ్చితాపురం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేలా అధికారులు చూడాలి

– సోయం కామరాజు, ఏపీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



లక్ష్మీనగరం గ్రామం ప్రధాన రహదారి నుండి, స్టేట్‌బ్యాంక్ దగ్గర నుండి రెండు వైపులా నుండి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే రహదారి మొత్తం గోతులమయంగా మారి ప్రజలు, అధికారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం త్వరలోనే సమస్యకు పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నాయి

– ముత్యాలరావు, దుమ్ముగూడెం ఎంపీడీఓ